

దొంగల ముఠా అరెస్టు

40కిపైగా చోరీ కేసుల్లో నిందితులను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.7.70 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. - 8లో..



మిల్లర్ వ్యాన్‌ను ఢీకొన్న లారీ

మిల్లర్ వ్యాన్‌ను లారీ ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. డ్రైవర్ పరారయ్యాడు. ఒంగోలులో ఈ ప్రమాదం జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
36 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఓపెన్ ఇంటర్ పత్రాల మూల్యాంకనం

- జిల్లాకు చేరిన 17122 మూల్యాంకన పత్రాలు

ఒంగోలు: ఏపీ ఓపెన్ ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన తన కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడి వివరాలను వెల్లడించారు. స్థానిక సెయింట్ థెరెస్సా ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఓపెన్ స్కూల్‌కు సంబంధించి ఏటా పదో తరగతి లేదా ఇంటర్ ఏదో ఒక దాన్ని మూల్యాంకనం కోసం ఒక్కో జిల్లాకు కేటాయిస్తారు. అయితే ఈ ఏడాది ప్రకాశం జిల్లాకు ఇంటర్ జవాబు పత్రాలను పంపారు. మొత్తం నాలుగు రోజుల పాటు మే 1వ తేదీ వరకు మూల్యాంకనం జరగనుంది. తెలుగు 4513, హిందీ -100, ఆంగ్లం-3027, గణితం-1218, ఫిజిక్స్-1910, రసాయన శాస్త్రం-1280, బయాలజీ-507, హిస్టరీ-520, పొలిటికల్ సైన్స్-1865, ఎకనామిక్స్-1024, కామర్స్-1158 పత్రాలు వచ్చినట్లు తెలిపారు. మూల్యాంకనం నిర్వహణకు సంబంధించి నలుగురు అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, 140 మంది అసిస్టెంట్ ఎగ్జామినరు 28 గ్రూపులుగా చేయడంతో పాటు స్క్రూటినైజింగ్ కోసం 28 మందిని నియమించామన్నారు.

30న వీఆర్‌ఓల సంఘ ఎన్నికలు

ఒంగోలు అర్బన్: గ్రామ రెవెన్యూ అధికారుల జిల్లా సంఘం ఎన్నికలు ఈ నెల 30న నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారిగా ఎన్‌టీఆర్ జిల్లా అధ్యక్షులు ఆర్ శ్రీనివాసరావు వ్యవహరిస్తారని తెలిపారు. రాష్ట్ర సంఘం నాయకులు ఎన్నికలకు హాజరవుతారని, జిల్లాలోని డివిజన్ నాయకులు వీఆర్‌ఓలు అంతా పాల్గొని ఎన్నికలను విజయవంతం చేయాలని, అనంతరం జరిగే జిల్లా సమావేశంలో పాల్గొనాలని కోరారు.

జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన రిటైర్డ్ హెచ్‌ఎం



రాంభూపాల్‌రెడ్డి (ఫైల్)

గిద్దలూరు రూరల్: రాచర్ల మండల ఎడవల్లికి చెందిన మార్కాపురం రాంభూపాల్‌రెడ్డికి జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కింది. దేశ రాజధాని ఢిల్లీ విజ్ఞాన భవన్‌లో ఈ నెల 26వ తేదీన నిర్వహించిన మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ ఈ నెలలో ప్రసారం కానున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాల్లో రాంభూపాల్‌రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహిస్తున్న మన్ కీ బాత్‌లో గత 99 ఎపిసోడ్‌లో దేశవ్యాప్తంగా గుర్తించిన 600 మంది ప్రముఖ వ్యక్తుల ఫొటోలతో కూడిన పుస్తక ఆవిష్కరణలో మొదటి పేజీలో రాంభూపాల్‌రెడ్డి ఫొటో ఉండటం విశేషం. అందులో ఆంధ్ర రాష్ట్రం నుంచి ఆరుగురిని కేంద్ర ప్రభుత్వం గుర్తించగా అందులో ఒకరు రాంభూపాల్‌రెడ్డి. మన్ కీ బాత్ పుస్తకాన్ని భారత ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. రాంభూపాల్‌రెడ్డి ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందిన అనంతరం వచ్చిన నగదును సుకన్య సమృద్ధి యోజన కింద పోస్టాఫీసులో డిపాజిట్ చేసి ప్రధానమంత్రి గుర్తింపు పొందాడు.

పోక్సో కేసు నమోదు

బేస్తవారిపేట: బాలికను వివాహం చేసుకున్న 27 ఏళ్ల వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు కంభం సీఐ రాజేష్‌కుమార్ గురువారం తెలిపారు. బేస్తవారిపేట మండలంలోని పందిళ్లపల్లెకు చెందిన ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న 16 ఏళ్ల బాలికను వరసకు బావ అయ్యే చేగిరెడ్డి వెంకట హరికుమార్‌రెడ్డి ఈ నెల 16వ తేదీన బాలికను తీసుకెళ్లి బ్రహ్మంగారి మఠం సమీపంలో వివాహం చేసుకున్నాడు. ఈ విషయంపై బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరికుమార్‌రెడ్డిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

ఫోన్ ద్వారా రూ.1.25 లక్షలకు టోకరా

కంభం: ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ ద్వారా రూ.1.25 లక్షలకు టోకరా వేశాడు. కంభంలో ఇద్దరు వ్యాపారులను మోసం చేసి ఉడాయించాడు. గురువారం పట్టణంలోని ఎరువుల షాపుకు వచ్చిన వ్యక్తి.. ఎరువులు కొనుగోలు చేయాలన్నాడు. అయితే, తన చేతిలో డబ్బు లేదని, ఫోన్ ద్వారా పంపిస్తానని చెప్పాడు. ముందుగా మీ ఫోన్ ద్వారా నా ఫోన్‌కు ఒక రూపాయి పంపుకుంటానని సదరు వ్యాపారిని నమ్మించాడు. అతని ఫోన్ తీసుకుని ఏకంగా రూ.95 వేలు పంపుకున్నాడు. ఇదే తరహాలో మరో దుకాణం వద్ద రూ.30 వేలు కాజేశాడు. అనంతరం గమనించుకున్న ఆయా షాపుల యజమానులు.. వారి ఫోన్లు తీసుకుని స్థానిక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

లాభం పండే..!

పొగాకు రైతుకు కాలం కలిసొచ్చింది. రెండేళ్లుగా లాభాలే లాభాలు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా మార్కెట్ ఆశాజనకంగా ఉంది. కర్ణాటకలో రైతులకు మంచి ధర లభించడం.. అక్కడ వేలం ముగియడంతో ఇక్కడ కూడా ఇంచుమించు అవే ధరలు రావడంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వేలం ప్రారంభంలో కేజీ ధర రూ.200 పలికింది. 43 రోజులు గడుస్తున్నా ధర రూ.195 నుంచి రూ.201 మధ్య పలుకుతోంది. ఒక్కో బ్యారన్‌కు సుమారు రూ.4 లక్షల వరకూ లాభం రావచ్చని రైతులు అంచనా వేస్తున్నారు.



- ఆనందంలో పొగాకు రైతులు
- రూ.195 నుంచి రూ.200 మధ్య నిలకడగా కేజీ పొగాకు ధర
- ఒక్కో బ్యారన్‌కు రూ.3.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం
- 107 మిలియన్ కేజీల కొనుగోళ్ల లక్ష్యం
- ఇప్పటికే 11 వేలం కేంద్రాల్లో 37 మిలియన్ కేజీల కొనుగోళ్లు
- అత్యధికంగా కొండపి ప్లాట్‌ఫాంలో 4.39 మిలియన్ కేజీలు
- అత్యల్పంగా కనిగిరి ప్లాట్‌ఫాంలో 2.0 మిలియన్ కేజీల కొనుగోళ్లు

చీమకుర్తి: పొగాకు రైతుల పంట పండింది. ఈ ఏడాది కూడా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. కొనుగోళ్లు ప్రారంభించింది మొదలు ఇప్పటి వరకు ప్రారంభంలో పలికిన ధరే నిలకడగా కొనసాగుతోంది. ఫిబ్రవరి 24న పొగాకు కొనుగోళ్లు మొదలవగా, దాదాపు 43 రోజుల పాటు ఇప్పటికీ ప్రారంభపు ధరే రెండు మూడు రూపాయలు అటూఇటుగా కొనసాగుతోంది. కేజీ ధర రూ.200 పలుకుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో ఇప్పటి వరకూ 37 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేశారు.

బ్యారన్‌కు రూ.3.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు లాభాలు...

ఒక్కో బ్యారన్‌కు భూమి నాణ్యతను బట్టి 7 నుంచి 8 ఎకరాల పొగాకు సాగు చేస్తారు. ఎకరా సాగుకు క్యూరింగ్ అయ్యే వరకు రూ.లక్ష ఖర్చవుతుంది. 7 ఎకరాల సాగుకు రూ.7 లక్షల వరకు ఖర్చవుతుండగా, రైతులకు ఒక్కో బ్యారన్‌కు ఖర్చులన్నీపోను రూ.3.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు లాభాలు రావచ్చని అంచనా వేస్తున్నారు. రెండేళ్ల కిందట కేజీ పొగాకు ధర రూ.160 నుంచి రూ.170 మధ్యే పలకగా, ఈ ఏడాది రూ.195 నుంచి రూ.200 మధ్య వస్తుండటంతో పొగాకు రైతుల పంట పండిందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

కొండెక్కిన కౌలు ధరలు...

బ్యారన్ కౌలు ధర నిన్నమొన్నటి వరకు రూ.లక్ష ఉండగా, ఇప్పుడు ఏకంగా రూ.1.60 లక్షలకు పెరిగింది. ఎకరా పొలం కౌలు ఇటీవల వరకు రూ.8 వేల నుంచి రూ.15 వేల మధ్య ఉండగా, పొగాకు ధరలు పెరుగుతుండటంతో నేడు ఒకేసారి రూ.20 వేలకు పెంచారు. దాంతో పొగాకు సాగు చేయాలనుకునే రైతులకు కౌలుకు బ్యారన్‌లు, పొలాలు దొరక్క ఎక్కువ కౌలు ఇచ్చయినా సరే సాగు చేయాలనే ఆలోచనలో ఉన్నారు.

కొనుగోళ్ల లక్ష్యం 107 మిలియన్ కేజీలు...

జిల్లాలోని 11 పొగాకు వేలం కేంద్రాల ద్వారా 107 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 37 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేసినట్లు బోర్డు అధికారుల వద్ద ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. అత్యధికంగా కొండపి ప్లాట్‌ఫాం ద్వారా 4.39 మిలియన్ కేజీల కొనుగోళ్లతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉండగా, కనిగిరి వేలం కేంద్రం 2.0 మిలియన్ కేజీలతో చివరి స్థానంలో ఉంది.

పొగాకు వేలం కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన పొగాకు పరిమాణం, సరాసరి ధర వివరాలు ఇలా ఉన్నాయి...

ప్లాట్‌ఫాం	పొగాకు పరిమాణం (మిలియన్ కేజీలు)	సరాసరి ధర
వెల్లంపలి-2	3.94	రూ.189.78
ఒంగోలు-1	4.26	రూ.193.28
ఒంగోలు-2	3.05	రూ.192.99
టంగుటూరు-1	3.45	రూ.194.47
కొండపి	4.39	రూ.196.14
పొదిలి	3.09	రూ.194.34
కనిగిరి	2.08	రూ.192.63
కందుకూరు-1	3.39	రూ.195.89
కందుకూరు-2	3.42	రూ.195.04
కలిగిరి	2.44	రూ.192.91
డీసీ పల్లి	3.31	రూ.196.17

సూర, పండుగుల్లకు సైతం మంచి రోజులు...

రైతులు పండించే పొగాకులో అతి తక్కువ రకమైన సూర పొగాకుకు కూడా మంచి రోజులు వచ్చాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో క్వింటా రూ.1000 నుంచి రూ.2 వేలకు మించి కొనుగోలు చేసే వారు కాదు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు పెరిగిన గిరాకీని దృష్టిలో ఉంచుకుని పొగాకు బయ్యర్లు సూరను కూడా గతంలో ఎప్పుడూ లేని విధంగా క్వింటాను రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. అదేవిధంగా కూలీలు సేకరించిన పండుగుల్లను గతంలో ప్రైవేటు డీలర్లు కొనుగోలు చేసేవారు. ఇప్పుడు దాన్ని కూడా పొగాకు బోర్డు ద్వారా నేరుగా కొనుగోలు చేసి దళారులకు వచ్చే లాభాలు నేరుగా కూలీలకు దక్కే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

పొగాకు రైతులు సంతోషంగా ఉన్నారు



ఈ ఏడాది ఒక్కో బ్యారన్‌కు రూ.3.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు లాభాలు వచ్చే అవకాశం ఉంది. దీంతో రైతులు చాలా సంతోషంగా ఉన్నారు. పండుగుల్లను ఏరుకునే కూలీలకు కూడా మంచి గిట్టుబాటు ధరలు దక్కే పరిస్థితులు ఉన్నాయి.

– సూరం గురవారెడ్డి, ఒంగోలు-1 ప్లాట్‌ఫాం అసోసియేషన్ ప్రెసిడెంట్, పేర్నమిట్ట

37 మిలియన్ కేజీల కొనుగోలు పూర్తి

ప్రకాశం జిల్లాలో ఈ ఏడాది 107 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేయాలని బోర్డు లక్ష్యంగా నిర్ణయించింది. ఫిబ్రవరి 24న జిల్లాలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభించాం. 43 రోజుల పాటు జరిగిన వేలంలో ఇప్పటి వరకు సుమారు 37 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేశాం. ఈ ఏడాది ఇప్పటి వరకు కేజీ పొగాకు ధర సరాసరిన రూ.194 నుంచి రూ.200 మధ్య నిలకడగా నడుస్తోంది.

– తులసి, ఆర్ఎం, పొగాకు బోర్డు, ప్రకాశం జిల్లా

పేదల కోసం ఎంత ఖర్చయినా భరిస్తాం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఒంగోలు 5వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



వృద్ధురాలికి పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: నిరుపేదలు, వారి బంగారు భవిష్యత్తు కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంత ఖర్చయినా వెచ్చిస్తుందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఒంగోలు నగరంలోని 5వ డివిజన్‌లో గోపాల్‌నగర్ మూడో లైన్, పరిసర ప్రాంత వీధుల్లో స్థానిక కార్పొరేటర్ ఎండేటి పద్మావతి రంగారావుతో కలిసి గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో ఒంగోలు నగరంలోనే ఐదో డివిజన్ ముందుందన్నారు. గోపాల్‌నగర్, కమ్మపాలెంలో శక్తికి మించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. కులమతాలకు, వర్గాలకు, వర్ణాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న గొప్ప నేత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని బాలినేని కొనియాడారు. ఎన్నో సంవత్సరాల నుంచి కొన్ని సమస్యల వల్ల బట్టీల రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అలాంటిది.. అన్ని సమస్యలూ పరిష్కరించి నేరుగా కమ్మపాలేనికి రోడ్డు కనెక్షన్ ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీదేనని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో కూడా ఈ పని చేయలేకపోయారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ఇంటికే వచ్చి అందిస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా జన్మభూమి కమిటీలేవీ అడ్డంకిగా లేవని గుర్తు చేశారు. అప్పట్లో వృద్ధులకు పింఛన్ కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఒక వేళ పింఛను వచ్చినా అవి తీసుకోవడానికి పంచాయతీ కార్యాలయానికో, మున్సిపల్ కార్యాలయానికో, ఎంపీడీవో కార్యాలయానికో వెళ్లి క్యూలో వేచి ఉండాల్సి వచ్చేదని గుర్తు చేశారు.

ఒంగోలు నగరంలో 25 వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చి ఇళ్లు కట్టించడానికి పూనుకుంటే టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోర్టుకు వెళ్లి అడ్డుకున్నాడని బాలినేని ధ్వజమెత్తారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆ 25 వేల మంది నిరుపేద కుటుంబాలకు స్థలం కొనుగోలు చేసి మరీ ఇళ్ల పట్టాలిచ్చి ఇళ్లు కట్టిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన గురించి బాలినేని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారని ప్రజలకు బాలినేని వివరించారు. ఒంగోలు నగర ప్రజల చిరకాల కోరిక అయిన మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్ రూ.339 కోట్లు మంజూరు చేశారని బాలినేని వివరించారు. పలువురు తమ వ్యక్తిగత సమస్యలను కూడా బాలినేని దృష్టికి తీసుకెళ్లగా, స్పందించి పరిష్కరిస్తూ ముందుకు సాగారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి శంకర్, గంటా రామానాయుడు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజని, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, ఫణిదపు సుధాకర్, పీవీ నాయుడు, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, కార్పొరేటర్ చల్లా తిరుమలరావు, ట్రేడ్ యూనియన్ నాయకుడు పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, పురిణి ప్రభావతి, దామరాజు క్రాంతికుమార్, భూమిరెడ్డి రమణమ్మ, పుట్టా సుధాకరరెడ్డి, పలుపులేటి శ్రీనివాసరావు, గోలి తిరుపతిరావు, బొమ్మినేని మురళి, 5వ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణరెడ్డి, జమ్ము శ్రీకాంత్, తాళ్లపాలెం శ్రీను (కొల్లూరు), వాకా తిరుమల, పి.మోహన్‌రావు, బొట్ల సుబ్బారావు, ఆసోది విజయలక్ష్మి, విక్కీ వెంకటేశ్వర్లు, ఎస్‌కే ఖుద్దూస్, రామిశెట్టి హరి, ఆవుల సురేంద్ర, గొల్లపోలు కృష్ణ, జాజుల కృష్ణ, రావులపల్లి శ్రీకాంత్, కఠారి సురేష్, మిరియం సుబ్బులు, గపూర్, మూసుబ్, దాసరి అమ్మన్న, మద్దసాని సుబ్బారావు, మిరియం వెంకటేశ్వర్లు, కే నివాస్, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి ఆదిమూలపు సురేష్

పేదల సంక్షేమానికి సీఎం కృషి

- మంత్రి ఆదిమూలపు సురేష్
- వైఎస్సార్ సీపీలో 30 కుటుంబాలు చేరిక
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాభివృద్ధితో పాటు పేదల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. గురువారం పుల్లలచెరువు మండలంలోని అక్కపాలేనికి చెందిన 30 కుటుంబాలు టీడీపీ, జనసేన పార్టీలను వీడి మంత్రి సురేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. వారందరికీ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి మంత్రి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సుదూర పాదయాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా చూశారని, ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పథకాలను అమలుచేసి పేదలకు తోడుగా నిలిచారని మంత్రి వివరించారు. సీఎం జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నమ్మిన అక్కపాలెం ప్రజలు టీడీపీ, జనసేన పార్టీలకు గుడ్‌బై చెప్పి వైఎస్సార్ సీపీలో చేరడం హర్షించదగిన విషయమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుంటేనే కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు సజావుగా అమలవుతాయన్న నమ్మకం ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి రోషిరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరిన వారిలో కురాకుల రమేష్, పోసాని వెంకట నారాయణ, పి.వెంకటేశ్వర్లు, పి.ఏడుకొండలు, శ్రీను బాబు, వెంకటనరసయ్య, కోటయ్య, పసుపుల ఏడుకొండలు, అలవాల చెన్నయ్య, ఎం.వెంకటేశ్వర్లు, చింతకాయల దండయ్య, మల్లి మహేష్, బోమిని వీరస్వామి, బి.కొండయ్య, మల్లి పెద్దవీరయ్య, శ్రీరాములు వెంకటేశ్వర్లు, మండ్ల వెంకటేశ్వర్లు, భూమని వీరస్వామి కుటుంబాలతో పాటు అక్కపాలెం తండా, చెంచుగూడేలకు చెందిన 30 కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బి.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పుస్తకాలు సిద్ధం

- కొత్త విద్యా సంవత్సరానికి పుస్తకాల పంపిణీ ప్రారంభం
- జిల్లా గోదాము నుంచి మండల కేంద్రాలకు తరలించిన డీఈవో రమేష్



పుస్తకాల సరఫరా ప్రక్రియకు పచ్చజెండా ఊపుతున్న డీఈవో రమేష్

ఒంగోలు: రానున్న విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరిచే నాటికే అన్ని రకాల పుస్తకాలను విద్యార్థులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఇప్పటికే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు జిల్లా ప్రభుత్వ పుస్తక నిల్వల కేంద్రానికి చేరాయి. వాటిని ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండల కేంద్రాల్లో ఉన్న జగనన్న విద్యాకానుక కిట్ల స్టాక్ పాయింట్లకు పంపే కార్యక్రమాన్ని ఒంగోలు ప్రభుత్వ పుస్తక సముదాయ కేంద్రం వద్ద జిల్లా విద్యాశాఖ అధికారి వి.రమేష్ గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మొదటి స్పెల్‌లో 15 లక్షల పుస్తకాలను 56 మండలాల్లోని స్టాక్ పాయింట్లకు తరలించనున్నట్లు తెలిపారు. తొలిరోజు కంభం, అర్ధవీడు మండలాలకు 42 వేల పుస్తకాలు సరఫరా చేస్తున్నామన్నారు. మొదటి దశ ప్రక్రియ మొత్తం పదిరోజుల్లో పూర్తిచేసేందుకు ఆర్టీసీ కార్గో అధికారులు సిద్ధమయ్యారన్నారు. పుస్తకాలు మండల స్టాక్ పాయింట్లకు చేరినప్పుడు వాటిని అన్‌లోడ్ చేసుకోవడం, జాగ్రత్తగా భద్రపరుచుకోవడంపై మండల విద్యాశాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్టాక్‌ను రిసీవ్ చేసుకున్న వెంటనే వాటిని తిరిగి స్కూల్ కాంప్లెక్స్ కేంద్రాలకు పంపేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వచ్చిన స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల డిపో మేనేజర్ వైవీ శివాజీ, డీసీఈబీ కార్యదర్శి డి.వెంకారెడ్డి, ఆర్టీసీ కార్గో మేనేజర్ కేజే నవీన్‌కుమార్, సమగ్ర శిక్ష ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ కేసీహెచ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ

తర్లుపాడు: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో గురువారం తెల్ల వారుజామున చోరీ జరిగింది. క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.5,130 నగదును అపహరించి కొన్ని మద్యం సీసాలను పగులగొట్టారు. చోరీ ఘటనపై ప్రభుత్వ మద్యం దుకాణ సూపర్‌వైజర్ గోపి కృష్ణ తాడివారిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని ఎక్సైజ్, సివిల్ సీఐలు సందర్శించారు. క్లూస్ టీంను రప్పించి ఫింగర్ ప్రింట్లు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై సుధాకర్ పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థిని వేధిస్తున్న వైస్ ప్రిన్సిపాల్

ఒంగోలు టౌన్: నగరంలోని ఓ ప్రముఖ జూనియర్ కాలేజీలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న మాధవ తనను వేధిస్తున్నాడని ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దిశ పోలీసుకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నవంబరు నుంచి సదరు వైస్ ప్రిన్సిపాల్ ఇంటర్మీడియెట్ విద్యార్థిని వేధిస్తున్నాడు. ఆమె సెల్‌ఫోన్‌కు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అసభ్యకరమైన దృశ్యాలను పంపిస్తున్నాడు. దీనికి ఆ బాలిక అంగీకరించకపోవడంతో ఇబ్బంది పెడుతున్నాడు. దీంతో ఆ బాలిక గత కొద్ది రోజులుగా కాలేజీకి వెళ్లడం మానేసింది. అయినా వేధింపులు మానకపోవడంతో విషయాన్ని తలిదండ్రులకు చెప్పింది. వారు వెంటనే ఎస్పీ మలికాగర్గ్ వద్దకు వెళ్లి తమ సమస్యను చెప్పుకున్నారు. దీనికి స్పందించిన ఎస్పీ వారిని దిశ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని సూచించారు. దీంతో గురువారం రాత్రి బాలిక తలిదండ్రులతో కలిసి దిశ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న సీఐ మల్లికార్జున దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడు అదృశ్యం

ఒంగోలు టౌన్: నగరానికి చెందిన బాలుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నగరంలోని నిర్మలా నగర్‌లో నివాసం ఉండే బాజీ బేల్దారిపనులు చేసుకుని జీవిస్తుంటాడు. అతడి కుమారుడు కరీముల్లా (17) 9వ తరగతి వరకు చదివి ఇంట్లో ఉంటున్నాడు. ఈ నెల 19వ తేదీన బాజీ, అతడి భార్య నూర్జహాన్‌లు పనులకు వెళ్లారు. ఆ సమయంలో కరీముల్లా ఇంట్లోనే ఉన్నాడు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చిన నూర్జహాన్‌కు కుమారుడు కనిపించలేదు. దీంతో ఆమె భర్తకు సమాచారం ఇచ్చింది. ఇద్దరూ కలిసి తమకు తెలిసిన చోటల్లా వెతికినా కనిపించలేదు. దీంతో గురువారం వన్ టౌన్ పోలీసుకు ఫిర్యాదు చేశారు.

బాలికను అపహరించిన వ్యక్తిపై కేసు నమోదు

మర్రిపూడి: బాలికను అపహరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.అంకమ్మరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు... మండలంలోని పన్నూరు గ్రామానికి చెందిన కిలారి వెంకట్రావు అదే గ్రామానికి చెందిన బాలికను అపహరించుకుపోయాడు. విషయం తెలుసుకున్న బంధువులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.అంకమ్మరావు తెలిపారు.

నియోజకవర్గాల వారీగా స్పందన కార్యక్రమాలు

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నిర్వహిస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించేందుకు శుక్రవారాలు ప్రత్యేక స్పందన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మే 1వ తేదీ మార్కాపురం నియోజకవర్గం, మే 22న గిద్దలూరు, జూన్ 12న యర్రగొండపాలెం, జూలై 3న దర్శి, జులై 24న కనిగిరి, ఆగస్టు 14వ తేది కొండపి, సెప్టెంబర్ 4 సంతనూతలపాడు నియోజకవర్గాల్లో నిర్వహిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ స్పందన మే 12వ తేదీ కనిగిరి, ఆగస్టు 25న మార్కాపురం, జూలై 14న ఒంగోలు నియోజకవర్గాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ మలికా గర్గ్



చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

- రూ.7.70 లక్షల సొత్తు స్వాధీనం
- 40కి పైగా కేసుల్లో ఉన్న నిందితులు
- పోలీసులను అభినందించిన ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: వరస చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాను ప్రకాశం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.7 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ మలికా గర్గ్ వివరాలను వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్‌లో నగరంలోని భాగ్యనగర్ 3వ లైనులో బాలిన శ్రీమన్నారాయణ కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు 5 కేజీల వెండి వస్తువులు, 64 గ్రాముల బంగారు అభరణాలు, రూ.20 వేల నగదు, ఫోను దొంగలించారు. అలాగే నవంబర్‌లో రాజీవ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో పర్వతం అనుపల్లవి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బంగారు అభరణాలు, రెండు ల్యాప్‌టాప్‌లను చోరీ చేశారు. అదే నెలలో బాపట్ల నగరంలోని ఎస్ఎస్‌వీ అగ్రహారంలో సోమరౌతు వెంకట తులసి ఇంటి కిటికీ గ్రిల్స్ తొలగించి లోపలికి ప్రవేశించిన దొంగలు వెండి వస్తువులను దోచుకుని వెళ్లారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లలో వరస చోరీలు జరుగుతుండడంతో సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ మలికా గర్గ్ ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు ఆధ్వర్యంలో ఒక టీంను నియమించారు. తమదైన శైలిలో దర్యాప్తు చేసిన పోలీసు ప్రత్యేక టీం రాజమండ్రికి చెందిన చొల్లంగి సురేష్, గుంటూరుకు చెందిన మర్రి రవికుమార్, కువ్వారపు అజయ్‌లతో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సమాచారాన్ని సేకరించారు. గురువారం ఉదయం ఒంగోలు గాంధీ రోడ్డులో ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. చొల్లంగి సురేష్‌పై 26 కేసులు ఉండగా, రవికుమార్ 15 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. వీరు ఒక ముఠాగా ఏర్పడి వైజాగ్, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్, మంగళగిరి ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరి వద్ద నుంచి వెండి, బంగారం, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సొత్తు విలువ రూ.7.70 లక్షల విలువ ఉంటుందని ఎస్పీ తెలిపారు. అంతరాష్ట్ర దొంగల ముఠాను పట్టుకొని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన పోలీసులకు ఎస్పీ మలికా గర్గ్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ (క్రైమ్) శ్రీధర్‌బాబు, ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టండి

- ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత మీపై ఉంది
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ఏది వాస్తవం..ఏది అసత్య ప్రచారం అన్నది ప్రజలకు సోషల్ మీడియా ద్వారా నిత్యం అప్రమత్తం చేయాలి. దీన్ని మీరు ఒక బాధ్యతగా తీసుకొని ముందుకు సాగాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక తన నివాసంలో సోషల్ మీడియా వారియర్స్‌తో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ వాస్తవం గడప దాటే లోపు అవాస్తవం ప్రపంచాన్ని చుట్టి వేస్తుందనే నానుడ్ని రూపుమాపాలన్నారు. అందుకు కఠోర శ్రమతో మాత్రమే సాధ్యమన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో పథకాలు ప్రవేశపెడుతుంటే ప్రతిపక్ష పార్టీలు మాత్రం తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ప్రజలను ఏదో ఒక విధంగా భ్రమలో ఉంచి లబ్ధి పొందాలనుకునే వారి ఆశలను వమ్ము చేయాలంటే అందుకు సోషల్‌మీడియా వారియర్స్ ఎంతో కృషి చేయాలన్నారు. తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు పసిగడుతూ ప్రతి ఒక్క కుటుంబానికి వాస్తవం తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఏం జరిగింది, ప్రస్తుత ప్రభుత్వంలో ఏం జరుగుతుందనేది సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరించి వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవడం ద్వారా మాత్రమే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయనే విషయంపై ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించాలనుకునేవారికి సరైన గుణపాఠం చెప్పేలా ప్రతి ఒక్కరు సిద్ధం కావాలన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ నగరంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి డివిజన్‌లోను అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఈ విషయాలపై ప్రతి ఒక్కరికీ తెలిసేలా , పచ్చమీడియా తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేలా విస్తృతంగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ పేర్నమిట్ట రాజిరెడ్డి , ఒంగోలు నియోజకవర్గ కన్వీనర్ మహబూబ్ పఠాన్, సోషల్ మీడియా ప్రతినిధులు సురేంద్రరెడ్డి, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడుతో పాఠశాలలకు మహర్దశ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

- జెడ్పీ బాలికల హైస్కూల్‌కు రెండో హాస్టల్ ఏర్పాటుకు కృషి
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారి సుందరంగా తయారవుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. చీమకుర్తిలో జిల్లా పరిషత్ బాలికల హైస్కూలు ప్రథమ వార్షికోత్సవం కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీమకుర్తిలోని నెహ్రూనగర్ నుంచి ఎస్ఎస్‌పీ కాలనీ సమీపంలో ఉన్న ప్రభుత్వ హైస్కూలుకు బాలికల రావడానికి పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బాలికల హాస్టల్‌కు సమీపంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి బాలికల కోసం ప్రత్యేకంగా జిల్లా పరిషత్ బాలికల హైస్కూలుగా ఏర్పాటు చేశామన్నారు. బాలికల హైస్కూలులో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తామన్నారు. హాస్టల్‌లో ఉన్న బాలికలకు హాస్టల్ సదుపాయం సరిపోకపోవడంతో సోషల్ వెల్ఫేర్ మంత్రి మేరుగ నాగార్జునతో మాట్లాడి జిల్లా పరిషత్ బాలికల హైస్కూలుకు సమీపంలో బాలికల కోసం ప్రత్యేకంగా రెండో హాస్టల్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చలువాది బదరీనారాయణ మాట్లాడుతూ జెడ్పీ బాలికల హైస్కూలు అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిని, వేమా శ్రీనివాసరావును, డాక్టర్ బి.జవహర్‌ను, చలువాది బదరీనారాయణను పాఠశాల ఉపాధ్యాయుల బృందం ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో సత్కరించి మెమెంటోలు అందించారు. తదుపరి హైస్కూలు బాలికలు ప్రదర్శించిన కోలాటం, కూచిపూడి నృత్యాలు, యోగాసనాలు, జానపద, సాంఘిక నృత్యాలు అలరించాయి.

బెట్టింగ్..కిడ్నాప్..సంకెళ్లు

- క్రికెట్ బెట్టింగ్‌లో తేడా రావడంతో యువకుడి నిర్బంధం
- పోలీసుల అదుపులో నలుగురు... పరారీలో ఇద్దరు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఒంగోలు టౌన్: నగరంలో క్రికెట్ బెట్టింగ్ వివాదం తెలుగు సినిమా తరహాలో అటు తిరిగి ఇటు తిరిగి పోలీసు అరెస్టులతో ఒక కొలిక్కి వచ్చింది ..డీఎస్పీ యు.నాగరాజు తెలిపిన వివరాలు ప్రకారం...నగరంలోని సత్యనారాయణపురం 3వ లైన్‌లో నివాసం ఉండే గుజ్జుల అయ్యప్ప 9వ తరగతి వరకు చదువుకుని చెడు వ్యసనాలకు బానిసై తిరుగుతున్నాడు. ఈ క్రమంలో అతడికి కేశవరాజుకుంటకు చెందిన రియాజ్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. ఇటీవల జరిగిన ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌కు అయ్యప్ప చేత బెట్టింగ్ పెట్టించాడు. చెన్నయ్ సూపర్ కింగ్స్ వర్సస్ రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో చెన్నయ్ సూపర్‌కింగ్స్ తరఫున రూ.15 వేలను బెట్టింగ్ పెట్టించాడు. అయితే ఆ టీం ఓడిపోయేలా ఉండడంతో అయ్యప్పకు ఫోన్ చేసిన రియాజ్ రాజస్థాన్ మ్యాచ్ వైపు బెట్టింగ్‌ను మార్చమని చెప్పాడు. అయితే సిగ్నల్ సరిగా లేకపోవడంతో అయ్యప్ప మార్చలేకపోయాడు. ఈ విషయాన్ని రియాజ్‌కు చెప్పగా అందుకు అతడు అంగీకరించలేదు. నాకు బెట్టింగ్‌లో వచ్చే రూ.23 వేలతో సహా మొత్తం రూ.38 వేలు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టాడు. దీంతో ఏం చేయాలో దిక్కు తోచని అయ్యప్ప రెండు రోజుల పాటు రియాజ్‌కు కనిపించకుండా తిరిగాడు. ఈ క్రమంలో పీవీఆర్ స్కూల్‌లో క్రికెట్ చూస్తున్న అయ్యప్పను ఈ నెల 21న రియాజ్ స్నేహితులు కరీమ్‌బాషా, నాగార్జున, వినోద్‌లు కలిసి బలవంతంగా తీసుకెళ్లారు. పాపాకాలనీలోని కరీమ్‌బాషా ఇంటికి తీసుకెళ్లి బంధించి కొట్టారు. అంతటితో ఊరుకోకుండా అయ్యప్ప తల్లి తిరుపతమ్మకు ఫోన్‌చేసి మీ అబ్బాయి మాకు డబ్బులు ఇవ్వాలి, అది ఇస్తేనే మీ అబ్బాయిని వదులుతామని బెదిరించారు. ఈ లోగా అయ్యప్ప అక్కడి నుంచి తప్పించుకున్నాడు. సమాచారం తెలిసిన తాలుకా పోలీసులు అతడిని వారి తలిదండ్రులకు అప్పగించి నిందితులు రియాజ్, కరీం బాషా, మౌలాలి, సాల్మన్‌లను అరెస్టు చేశారు. నాగార్జున, వినోద్‌లు పరారీలో ఉన్నారు.

మిల్లర్ వ్యాన్‌ను ఢీకొన్న లారీ

- ఘటనా స్థలంలోనే మహిళ మృతి
- ఆరుగురికి గాయాలు
- పరారీలో లారీ డ్రైవర్



హైవే మీద ఆగిపోయిన వాహనాలు



మృతి చెందిన సంపూర్ణ

ఒంగోలు టౌన్: బేల్దారీ కూలీలతో వెళుతున్న మిల్లర్ వ్యాన్‌ను టర్బో లారీ ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందగా, ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం ఉదయం ఎన్‌హెచ్–16 హైవేలో కొప్పోలుకు సమీపంలోని ఎన్ అగ్రహారం చప్టా వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. పెళ్లూరుకు చెందిన 12 మంది బేల్దారీ కూలీలు కాంక్రీట్ పనుల నిమిత్తం గురువారం ఉదయం మిల్లర్ వ్యాన్‌లో కొప్పోలుకు బయలుదేరారు. ఉదయం 6.45 గంటల సమయంలో వ్యాను ఎన్‌హెచ్–16 హైవేలోని పెళ్లూరు బ్రిడ్జి మీదుగా కొప్పోలుకు సమీపంలో ఎన్ అగ్రహారం చప్టా వద్దకు రాగా వెనకు నుంచి చెక్కల లోడుతో నెల్లూరు నుంచి విజయవాడ వెళుతున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన టర్బో లారీ వేగంగా వచ్చి వెనక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కూలీలతో వెళుతున్న మినీ వ్యాను హైవే మీద బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న 12 మంది ఎగిరి కింద పడిపోయారు. కిందపడిపోయిన ఇర్ల సంపూర్ణ(32) అనే మహిళ మీద మిల్లర్ పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సంపూర్ణకు ఇద్దరు సంతానం కాగా పెద్దమ్మాయి 4వ తరగతి చదువుతోంది. చిన్నమ్మాయి అంగన్‌వాడీకి వెళుతుంది. మిగిలిన వారిలో మినీ వ్యాను డ్రైవర్ బండారు పెద్ద పెద్దయ్యతో పాటుగా బండారు లక్ష్మీ దేవి, చిన పెద్దయ్య, సుశీల, ఇర్ల రజనీ, బండారు రాజులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మినీ వ్యానును ఢీకొట్టిన టర్బో నేరుగా దూసుకొనిపోయి రోడ్డు పక్కన పడిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే టర్బో లారీ డ్రైవర్, క్లీనర్ పరారయ్యారు. హైవేపై ప్రమాదం జరగడంతో కాసేపు ట్రాఫిక్ ఇబ్బంది కలిగింది. తాలుకా సీఐ రాంబాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్



సంక్షేమ పథకాల లబ్ధి బుక్‌లెట్‌ను అందచేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందచేస్తున్నట్లు ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు ఇంటి నివేశన స్థలాలు, డ్రైనేజీ కాలువలు, పారిశుధ్యం తదితర సమస్యలను ఎమ్మెల్యే బుర్రాకు విన్నవించగా, తక్షణ సమస్యల పరిష్కారానికి కమిషనర్ డీవీఎస్ నారాయణరావును, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో కూడా ఇచ్చిన హామీలను అమలు చేసి రాష్ట్ర ప్రజలను ఆదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. తుమ్మగుంటలోని జగనన్న లే అవుట్ కాలనీ స్థలంపై టీడీపీ నేతలు కోర్టుకు వెళ్లడం వల్లే పేదలకు కాలనీలు, ఇంటి పట్టాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతున్నట్లు చెప్పారు. అర్హులందరికీ ఇంటి నివేశన స్థలాలు అందచేస్తామన్నారు. సచివాలయ వ్యవస్థతో రాష్ట్రంలో సుమారు 4 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బుర్రా ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించి, బుక్‌లెట్‌ను అందచేశారు. తొలుత కౌన్సిలర్లు ఎస్కే ఖాశింసా, పసుపులేటి దీప, కోఆప్షన్ సభ్యుడు ఖాజా మొహిద్దీన్, మన్సూర్, డీలర్ ఖాజా, అరుణోదర్, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, ప్యారీ జాన్‌లు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్, మాణిక్యరావు, కౌన్సిలర్లు వేల్పుల వెంకటేశ్వర్లు, తమ్మినేని సుజాత, దేవరాజ్, దేవకి సత్యవతి, రామనబోయిన శ్రీను, పెన్నా ఏడుకొండలు, దాసరి మురళీ, నక్కా రామకృష్ణా, దేవకి రాజీవ్, షఫీ ఆజాద్, తిరుపతయ్య, జానీ సయ్యద్ నాయబ్ రసూల్, నాయకులు భాగ్యమ్మ, దుర్గమ్మ, కనమర్లపుడి లక్ష్మీ మోహన్, బాదం సత్యం, పిల్లి లక్ష్మీ నారాయణ రెడ్డి, డాక్టర్ రసూల్, కృష్ణా, బొట్టు శ్రీను, డీలర్ ఫణీ, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏఎంసీ డైరెక్టర్ బాదం సత్యన్నారాయణ ఏర్పాటు చేసిన అల్పాహార విందులో ఎమ్మెల్యే, చైర్మన్, నాయకులు పాల్గొన్నారు.